క్లుప్తంగా

కోబాల్ట్ పేట బూత్‌లో బీఎల్‌ఓ అత్యుత్సాహం

నగరంపాలెం: 34వ డివిజన్ కోబాల్ట్‌పేట రెండో వీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ లూథరన్ ప్రైమరీ పాఠశాల పోలింగ్ కేంద్రంలోని ఓ బీఎల్‌ఓ అత్యుత్సాహం ప్రదర్శించింది. దీంతో ఓటర్లకు ఇబ్బందులు తప్పలేదు. ఈ కేంద్రంలో ఓట్లు వేసేందుకు కోబాల్టుపేట పరిసర ప్రాంతాల్లోని ఓటర్లు పోలింగ్ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. అయితే ఓ బీఎల్‌ఓ అత్యుత్సాహంతో ఓట్లు వేసేందుకు వచ్చిన వారిని ముప్పతిప్పలకు గురిచేశారు. ఓటు వేసేందుకు తీసుకొచ్చిన గుర్తింపు కార్డులు అది, ఇది కాదంటూ ఇబ్బందికి గురిచేశారు. దీంతో గుర్తింపు కార్డుల కోసం ఓటర్లు ఇంటి వైపు పరుగు తీశారు. ఆఖరికి ఓ యువ ఓటరు ఓటు వేసేందుకు రాగా, ఓటు వేసేందుకు అర్హతలేదంటూ సదరు బీఎల్‌ఓ హుకుం జారీ చేసింది. దీంతో ఓటరు దగ్గర్లోని ఇంటికెళ్లి, విద్యార్హత ధ్రువీకరణ పత్రంతో తీసుకురాగా, అప్పుడు ఓటు వేసేందుకు అనుమతించడం విశేషం. సాయంత్రం వేళ గడువు ముగిసే కొద్ది ఓటర్లు బారులు తీరారు. సమయం గడిచే కొద్ది బూత్ సిబ్బంది అలస్యం చేయడంపై ఓటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈలోగా ఎన్నికల అధికారులు, పశ్చిమ డీఎస్పీ మహేష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వివాదం కాస్త సద్దుమణిగింది.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ దాడి

గుంటూరు ఈస్ట్: పచ్చచొక్కాల టీడీపీ నాయకులు బరితెగించారు. దొంగ ఓట్లు వేయడాన్ని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి చేశారు. ఎన్నికల్లో తమ అరాచకాలను అడ్డుకున్నవారి ప్రాణాలు తీసేందుకు కూడా వెనుకాడలేదు. వివరాలు.. సంగడిగుంట చలమయ్య విద్యా సంస్థల ప్రాంగణంలో టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారన్న సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ 14వ వార్డు అధ్యక్షుడు గుదె నాగేశ్వరరావు తన అనుచరులతో వెళ్లి అడ్డుకున్నాడు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు నాగేశ్వరరావు, అతని అనుచరులపై దాడిచేశారు. దాడిలో నాగేశ్వరరావు తలకు తీవ్రగాయమైంది. బాధిత నాగేశ్వరరావు పార్టీ నాయకుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈస్ట్ అడిషనల్ ఎస్పీ నిచికేత్ షలేకే సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చాడు. అక్కడున్న వారికి సర్దిచెప్పారు. ఇంతలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చలమయ్య చలమయ్య ప్రాంగణం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను సర్దిచెప్పి పంపివేశారు. నాగేశ్వరరావును అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. లాలాపేట పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ ఏజెంట్ల మధ్య రగడ

ఇరు వర్గాల తోపులాట
పోలీసుల రంగ ప్రవేశంతో
సర్దుమణిగిన గొడవ



కొరిటిపాడు(గుంటూరు): చుట్టుగుంటలోని గుంటూరు మార్కెట్ కమిటీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబరు-227లో ఇరుపార్టీల ఏజెంట్ల మధ్య చిన్నపాటి గొడవ రాజుకుంది. చివరకు చిలికి చిలికి గాలివానలా పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట, పిడిగుద్దుల వరకూ వెళ్లింది. ఒక పార్టీకి చెందిన ఏజెంట్ బూత్ బయటకు వచ్చి మంచినీరు కావాలని అడుగగా అదే పార్టీకి చెందిన కార్యకర్త పోలింగ్ బూత్ ఆవరణలోకి వెళ్లారు. దీంతో మరో పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో తోపులాటకు దిగారు. స్థానికంగా ఉన్న పోలీసులు పై అధికారులకు సమాచారం ఇవ్వడంతో నగరంపాలెం సీఐతో పాటు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

సైకిల్‌కు ఓటెయ్యనన్నందుకు..

- దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



మంగళగిరి: నగర పరిధిలో బేతపూడి శిబిరంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. స్థానిక ఓటరు చుక్కా ఏసురత్నాన్ని టీడీపీకి ఓటు వేయాలని కోరగా తిరస్కరించారు. వైఎస్సార్ సీపీకి వేస్తానని చెప్పడంతో స్థానిక టీడీపీ కార్యకర్తలు దిడ్డ సత్యానందం, కార్యంశెట్టి రాజు, కార్యంశెట్టి దేవరంలు దాడి చేసి గాయపరచారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ ఆసాంతం..తెనాలి ప్రశాంతం

- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు
- వాటికి మరమ్మతులు చేపట్టిన టెక్నీషియన్లు
- ఈవీఎంల మొరాయింపుతో ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ
- సాయంత్రం 6 గంటలు దాటినా.. కొన్ని బూతుల్లో కొనసాగుతున్న ఓటింగ్



ఐతానగర్ ఎర్రబడి వద్ద బారులు తీరిన ఓటర్లు



బాయ్స్ హైస్కూల్‌లో వృద్ధురాలిని వీల్ చైర్‌పై తీసుకొస్తున్న కుటుంబ సభ్యుడు

తెనాలిఅర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తెనాలి పట్టణంలో సోమవారం నిర్వహించిన ఓటింగ్ ప్రక్రియ దాదాపు ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని పలు బూతుల్లో అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడం.. వాటిని అధికారులు వెంటనే బాగు చేయిస్తుండటంతో పెద్దగా సమస్య ఏర్పడలేదు. ఓటింగ్ ప్రక్రియ మాత్రం కొంత ఆలస్యంగా కొనసాగింది. తెనాలి పట్టణ పరిధిలోని 40 వార్డుల్లో 1,56,985 ఓటర్లు ఉన్నారు. అధికారులు 51 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 6.30 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు చేరుకున్నారు. అధికారులు 7 గంటలకు ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. అప్పటి నుంచి ఉదయం 11 గంటల వరకు ఓటింగ్ బాగా జరిగింది. వేసవి తీవ్రత ఉండటంతో అక్కడి నుంచి పోలింగ్ శాతం కొంచెం తగ్గుతూ వచ్చింది. ఓటర్లు కూడా తక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు రావడం కనిపించింది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత తెనాలి పట్టణంలో వర్షం పడటంతో ఆ సమయంలో క్యూలో ఉన్నవారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సుమారు అర్ధగంటకు పైగా వర్షం కురిసింది. ఆ తర్వాత వర్షం తగ్గడం, వాతావరణం చల్లబడటంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు అధిక సంఖ్యలో చేరుకున్నారు. భోజన విరామం తర్వాత ఓటర్లను అధికారులు ఓటు వేసేందుకు అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు కేంద్రాలకు వస్తునే ఉన్నారు. ఆరు గంటల లోపు వచ్చిన వారిని అనుమతించి ఆ తర్వాత వచ్చిన వారికి అనుమతి నిరాకరించారు. రాత్రి 7 గంటలు దాటినా కొన్ని కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగింది.

మొరాయించిన ఈవీఎంలు.

ఐతానగర్‌లోని ఆది ఆంధ్ర ఎలిమెంటరీ స్కూల్‌లో ఉదయం 7.30 సమయంలో ఈవీఎం మొరాయించింది. విషయం తెలుసుకున్న అధికారులు టెక్నీషియన్ పిలిపించి మరమ్మతులు చేయించారు. నాజర్ పేటలోని హిందీ ప్రేమీ మండలి, గాంధీ నగర్‌లోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు వాటికి అతి కొద్ది నిమిషాల్లోనే మరమ్మతులు చేయించారు. దీంతో ఓటింగ్ ప్రక్రియ కొంత ఆలస్యంగా సాగింది.

అవస్థలు పడిన వృద్ధులు, దివ్యాంగులు

తెనాలి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు కొంత అవస్థలు పడ్డారు. వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన సమయంలో వీల్‌చైర్స్ అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు వారిని చేతులపై మోసుకుంటూ తీసుకువెళ్లి ఓట్లు వేయించారు. కొన్ని కేంద్రాల్లో సిబ్బంది అలాంటి వారికి సేవలందించారు. అలాగే మున్సిపల్ ఉద్యోగులు కూడా సేవలందించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

తెనాలి పట్టణ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించి ఓటింగ్ శాతం తెలుసుకున్నారు. అలాగే నిబంధనలకు అనుగుణంగా అందరూ వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి గంటకు నమోదు అయిన ఓటింగ్ శాతాన్ని తెలుసుకున్నారు.



ఓటింగ్ కేంద్రాల వద్ద ఉన్న వైద్యారోగ్య సిబ్బంది



వృద్ధుడుని మోసుకువస్తున్న కుటుంబ సభ్యులు



ఎన్‌సీఆర్ స్కూల్‌లో..

రూరల్‌లో ప్రశాంతంగా పోలింగ్

తెనాలి రూరల్: రూరల్ మండల గ్రామాల్లో గురువారం ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. 18 గ్రామాల్లో 64,666 ఓట్లు ఉండగా సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి సుమారు 63 శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. మంచి నీటి సౌకర్యం కల్పించారు. దివ్యాంగులకు తమ ఓటు హక్కును వినియోగించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో బాలకుటీర్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్.మంగాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరైన 197 మంది విద్యార్థులందరు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. 485 మార్కులతో రేయాన్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సబ్జెక్టుల వారీగా ఇంగ్లిష్-97, ద్వితీయ భాష-100, మ్యాథ్స్-100, సైన్స్-97, సోషల్-99 మార్కులను విద్యార్థులు సాధించారని వివరించారు. 25 మందికి పైగా 90 శాతం, 65 మందికి పైగా 80 శాతం మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థుల కృషి, పట్టుదల, నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో విలువలతో కూడిన విద్య నేర్చుకుని, సమాజంలో ఉన్నత పౌరులుగా నిలవాలన్నదే తమ ఆశయమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను సహకార్యదర్శి జయశ్రీ, సీఏవో రఘురాం గారు, ప్రిన్సిపాల్ సుధా మాధవి అభినందించారు.

కొల్లిపరలో పోలింగ్ ప్రశాంతం



తూములూరులో క్యూలో ఉన్న ఓటర్లు



కొల్లిపరలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

కొల్లిపర: మండల పరిధిలోని పోలింగ్ సోమవారం ప్రశాతంగా జరిగింది. మండంలోని 20 గ్రామాలకు గాను 51 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 45,002 ఓటర్లకుగాను సాయంత్రం 7గంటలకు సుమారు 68.85 శాతం ఓట్లు పోలైయ్యాయని, సాయంత్రం ఆరుగంటల్లోగా కేంద్రాల్లోకి వచ్చిన ఓటర్లను కేంద్రాల్లో ఉంచి తురువాత బఋయట నుండి ఎవరిని అనుమతించకుండా పలు కేంద్రాల్లో రాత్రి 9గంటల వరకు పోలింగ్ జరిగిందని మండల సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు క్యూలైన్లు, షామియానాలు స్వల్పంగా ఏర్పాటు చేశారు. ఎండలు బాగా వేయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లులకు సరైన సౌకర్యాలు కల్పించటంలో అధికారులు విఫలం అయ్యారు. దీంతో ప్రజలు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈవీయంలు ప్రాంభంలో సమయానికి సరిగా పని చేయక పలు గ్రామాల్లో ఓటర్లు గంటలకొద్దీ కేంద్రాల వద్ద నిలబడాల్సివచ్చింది. వల్లభాపురంలో 239 బూత్‌లో ఉదయం 7గంటల నుండి 9 గంటల వరకు ఈవీయంలు పనిచేయలేదు, అన్నవరం లో 271, 272 బూత్‌లో ఈవీయంలు పనిచేయలేదు. . షామియానాలు సరిపోక త్రాగ తానికి మంచి నీరు లేక ఇబ్బందులు పడ్డారు. సరైన సౌకర్యాలు లేక మహిళా ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. తూములూరు, కొల్లిపర, మున్నంగి గ్రామంలో పోలింగ్ బూత్‌లో సల్పంగా క్యూలో తొక్కిసలాట జరిగింది.ప్రధానంగా ఓటర్లకు పోలీస్ సిబ్బంది సహకరించలేదన్న విమర్శలు ఎక్కువగా వినిపించాయి.

వైఎస్సార్ సీపీకి అఖండ విజయం

ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ భార్య పుష్ప



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అభివాదం ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

తెనాలిఅర్బన్: నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయబోతున్నట్లు తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెనాలి ఐతా నగర్‌లోని ఎర్రబడి పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఉదయం ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్రంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అభివాదం చేస్తూ అందరిని అప్యాయంగా పలకరించారు. వారి యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అఖండ విజయం సాధించనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనతో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని చెప్పారు. ఆయన అందించిన సంక్షేమ ఫలాలను కొనసాగించాలంటే అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. అలాగే మహిళలు యువకులు, ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరిస్తున్నారని తెలిపారు. జూన్ 4 తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణస్వీకారం చేయనున్నట్లు దీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట కుటుంబ సభ్యులు అన్నాబత్తుని పుష్ప, అన్నాబత్తుని సత్యనారాయణ, అన్నాబత్తుని అఖిల్ గణేష్, 39వ వార్డు కౌన్సిలర్ గెడ్డేటి ఝాన్సీవాణి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

■ తెనాలి కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా, మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తన ఓటు హక్కును సోమవారం ఉదయం వినియోగించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం పట్ల వ్యతిరేకతతో ఉన్నారని, ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతున్నారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.

ఓటెత్తిన తెనాలి



సుల్తానాబాద్‌లో బారులు తీరిన ఓటర్లు

- బారులు తీరిన మహిళా ఓటర్లు
- రాత్రి తొమ్మిది గంటలకూ కొనసాగిన పోలింగ్

తెనాలి: నియోజకవర్గంలో పోలింగ్ ముమ్మరంగా జరిగింది. సాయంత్రం ఆరు గంటలలోపు పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ఓటర్లకు ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. దీనితో అప్పటికి పోలింగ్ కేంద్రాల తలుపులు మూసేసి లోపలున్న ఓటర్లచే ఓటు వేయిస్తున్నారు. పోలింగ్ శాతం 2019 ఎన్నికలకు మించి 73 శాతానికి పైగా నమోదు కాగలదని అంచనా వేస్తున్నారు. వేసవి కావడంతో ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. గంట గంటకు ఓటింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. తొమ్మిది గంటలకు 4.54 శాతం పోలింగ్ నమోదు కాగా.. 11 గంటలకు 18.55 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు 38.24 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో ఓటర్లు తగ్గారు. దీనితో మూడు గంటలకు 45.56 శాతం మాత్రమే ఓటు వేశారు. వర్షం వెలిసి చల్లబడ్డాక మళ్లీ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. సాయంత్రం అయిదు గంటలకు 59.13 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసే ఆరు గంటలకు 65.69 శాతం మంది ఓటు చేశారు. వాస్తవానికి అప్పటికి పోలింగ్ ముగిసినప్పటికీ పోలింగ్ కేంద్రాల్లోకి ఆరు గంటలకల్లా వచ్చిన అందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీనితో ఆ సమయానికి చాలా పోలింగ్ బూత్‌ల్లో జనం ఉన్నారు. పట్టణంలోని ఎన్‌సీఆర్‌ఎం స్కూలు, చెంచుపేట తాయారమ్మ హాస్టలు, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, అయితానగర్ ఎన్ఎస్ఎస్ఎం స్కూల్, రూరల్ మండలంలో పెదరావూరు, కఠెవరం వంటి మేజరు పంచాయతీల్లో రాత్రికి కూడా ఓటు వేసేందుకు జనం పోలింగ్ కేంద్రాల్లో వేచివున్నారు. దాదాపు 73 శాతం పైగా నమోదయే అవకాశం ఉందని భావిస్తున్నారు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహిళల ఓటింగ్ శాతం అధికంగా ఉందన్న అంచనా ఉంది.

సాంకేతిక లోపం.. సర్వత్రా జాప్యం

ఫిరంగిపురం: ఈవీఎంలలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా పలుచోట్ల పోలింగ్ కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. ఇది మినహా మండల వ్యాప్తంగా మొత్తం 18 గ్రామాల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగింది. ఉదయం 6 గంటలకే ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు షామియానాలు, తాగునీటి సౌకర్యం, కుర్చీలు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో కేఎల్‌పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ-2024 టెన్త్, 12వ తరగతి ఫలితాల్లో డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో విద్యార్థుల అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో సైన్స్ గ్రూపు ఎంపీసీ గ్రూపు నుంచి 500 మార్కులకు పెరుమాల నాగశ్రీ 488 మార్కులు సాధించినట్లు వివరించారు. ఎంబైపీసీ నుంచి శ్రీనివాసన్ సహన 464, ఆర్ట్స్ గ్రూపులో హెచ్‌పీజీ నుంచి గరికపాటి పావని 443, బంకా ఆకాశ్ 431 మార్కులు సాధించినట్లు వివరించారు. అదే విధంగా టెన్త్ ఫలితాల్లో 500 మార్కులకు అలుగుల శెట్టి రాజహంసిని 486, షేక్ సుమయా సల్మా 475 మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య అభినందించారు.

ఉత్కంఠగా సాగిన సార్వత్రిక పోలింగ్ ప్రక్రియ



మేడికొండూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడిచేస్తున్న టీడీపీ శ్రేణులు



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

మేడికొండూరు : సార్వత్రిక ఎన్నికలు మండలంలో ఉత్కంఠ పరిస్థితుల్లో సోమవారం ముగిశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని 14 గ్రామాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వైపు వడివడిగా అడుగులు వేశారు.

టీడీపీ వర్గీయుల దాడులు

మండల కేంద్రమైన మేడికొండూరులో 46, 47, 48 పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఓటర్లను సైకిల్ గుర్తుకు వేయాలంటూ ప్రచారం చేశారు. గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించడంతో దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలపై కర్రలతో టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. కొర్రపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో 168 పోలింగ్ స్టేషన్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వృద్ధులను ఓటు వేసేందుకు తీసుకొస్తున్న సమయంలో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రసన్న, చెన్నయ్య, అనిల్, విజయ్ గాయపడ్డారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. జంగంగుంట్లపాలెం, పొట్టపాడు 168 పోలింగ్‌బూత్‌లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు వాదనకు దిగారు. ఈ నేపథ్యంలో అధికారులు కొంత సమయం పోలింగ్ నిలిపివేశారు. నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు.

అంకిరెడ్డిపాలెంలో టీడీపీ రౌడీమూకల దాడి

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద పోలింగ్‌లో కొందరు రౌడీ మూకలు అలజడి సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూశారు. వెంటనే స్పందించిన ప్రజలు వారికి దేహశుద్ధి చేశారు. గుంటూరు, వెంగళాయపాలెం గ్రామాలకు చెందిన కొందరు రౌడీ మూకలు పూటుగా మద్యం సేవించి అంకిరెడ్డిపాలెంలో జరుగుతున్న పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చారు. పోలింగ్ కేంద్రం సమీపంలోని ఖాళీ స్థలంలోని గడ్డి చెత్తకు నిప్పంటించారు. దీంతో గాలికి నిప్పు చెలరేగి చుట్టుపక్కల ఇళ్ల పైకి వచ్చింది. సమీపంలోని చిల్లరకొట్టుకు సైతం అంటుకుంది. నిప్పంటించి జై పెమ్మసాని అంటూ ఆకతాయిలు పోలింగ్ కేంద్రంలోకి జొరబడపోతుండటంతో స్థానికులు సుమారు 40 మంది రౌడీ ఆకతాయిలను అడ్డుకున్నారు. అందినవారికి అందినంత దేహశుద్ధి చేశారు. దీంతో రౌడీ మూకలు పరారయ్యారు. వారిలో సుమారు 10 మందిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గతంలో ఎన్నడు తమ గ్రామంలో ఎటువంటి అల్లర్లు లేవని కావాలని టీడీపీ నాయకులు, పెమ్మసాని అనుచరులు రౌడీ మూకలను తమ గ్రామంపైకి దాడిచేయిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు.